జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



బుధవారం | 6-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 417 పేజీలు: 4 వెల : రూ.7


# మహిళల ఆశలు మింగిన.. మెప్మా మేనేజర్!

* మహిళా మార్ట్ పేరుతో మోసం.. లక్షల్లో డబ్బుల మాయం! * పెట్టుబడి పెడితే మిగిలినదల్లా మాటలే..! * పబ్లిక్ డబ్బుతో ప్రైవేట్ దందా! * మహిళల నమ్మకాన్ని తాకట్టుపెట్టిన అధికారులు! * బయటపడుతున్న వెంకటరావు దందాలు ! * వెనుకదాగిన చెక్కుల రాజకీయం..! * లెక్కలలో లెక్కలు వేసిన లెవెల్..! * వెంకటరావు పంచనామా.. 60 లక్షలు ఎక్కడికెళ్లాయి? * చెల్లింపులకూ చీకటి చేతులు..! * మౌనమే సమ్మతమా?.. జిల్లా అధ్యక్షురాలు ఏం చెబుతారు? * చెక్కు పవర్ ఉంది.. కానీ పెదవి లేదు! * వాటాల వేట.. మహిళా మార్ట్‌లో ఎవరి పాత్ర ఎంత? * పదవుల కోసం ప్రజాధనాన్ని తాకట్టు! * నగదు దందాలకు నాయకత్వ ముద్రలు? * ముద్దుబిడ్డల దోపిడీకి మహిళలు బలి..! * సంచుల్లోనూ స్కాంలోనూ రంధ్రాలే..! * మంచికి పోయి.. మోసపోయిన అమ్మాయిలు! * మాటలతో మాయ చేసి.. డబ్బులు దించేసిన ధనవంతులు! * బలహీనుల నమ్మకాన్ని వడ్డీతో దోచుకున్నారు!

**శ్రీకాకుళం, ఆగస్టు 5 (వార్త):** మెప్మా సిటీ మిషనరీ మేనేజర్ వెంకట రావుపై ఆరోపణలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మహిళా మార్ట్ కుంభకోణానికి కేంద్ర బిందువుగా ఉన్న వెంకట రావు.. ఇప్పటి వరకూ ఎన్నో అవినీతి చర్య లకు పాల్పడ్డట్లు బాధిత మహిళలు ఆరోపిస్తున్నారు. పైకి సేవా కార్యక్రమాలన్నా, లోపల మాత్రం లెక్కల మాయాజాలంతో లక్షల రూపాయలు మింగేశాడనే వివరాలు ప్రస్తుతం మహిళా సంఘాల్లో చర్చనీయాంశంగా మారాయి.




శ్రీకాకుళం, ఆగస్టు 4(వార్త): మహిళల స్వశక్తి, ఆర్థిక స్వావలంబన కోసం ఏర్పడిన మహిళా మార్ట్‌లో భారీగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మాజీ మంత్రి ధర్మాన మనుషులు ఇప్పుడు అధికార పార్టీకి అండగా వ్యవహరిస్తున్న మెప్మా సిటీ మిషనరీ మేనేజర్ వెంకటరావు, జిల్లా మహిళా సంఘాల అధ్యక్షురాలు బలగ నాగలక్ష్మి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినవారికి అండగా నిలుస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు అత్యంత సన్నిహితులుగా ఉన్న ఈ ఇద్దరూ, మహిళల ఆశలను పెట్టుబడిగా పెట్టి ధనానికి మోసాలకు పాల్పడ్డారని మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

మోసపూరిత హామీలు, బెదిరింపుల పర్వం..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో, మహిళా మార్ట్ పేరుతో ప్రతి మహిళా సంఘ సభ్యురాలు దగ్గర నుంచి రూ.150 చొప్పున వసూలు చేశారు. అధికారులు ఒత్తిడి మీద 77 మంది ఆర్‌పీలు డబ్బులు వసూలు చేశారు. ఈ 77 మంది ఆర్పీలు ప్రతి ఒక్కరి దగ్గర నుంచి రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టించి, "ఆరు నెలల్లో మీ పెట్టుబడికి రెట్టింపు లాభం వస్తుంది" అని నమ్మబలికారు. కానీ, ఏడాది గడిచినా సగం మాత్రమే తిరిగి ఇచ్చి, ఇప్పుడు నష్టం వచ్చిందని చేతులెత్తేస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ మోసాన్ని ప్రశ్నించడానికి వెళ్లిన మహిళా సంఘ సభ్యులను సిటీ మిషనరీ మేనేజర్ వెంకటరావు బెదిరిస్తున్నాడు. "ఆమె ఎమ్మెల్యే మనిషి.. ఆమెను అడగడానికి మీ స్థాయి ఏంటి?" అంటూ భయపెడుతున్నాడని, మరికొందరిని "ఇలా మాట్లాడితే మిమ్మల్ని సంఘం నుంచి తొలగిస్తాం" అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని సమాచారం. ప్రభుత్వ పదవులను అడ్డుపెట్టుకొని ప్రజాధనాన్ని కాజేస్తున్న ఈ వ్యవహారంపై గత ప్రభుత్వంలో జరిగిన అవినీతికి వీరు ఇద్దరు అడ్డుపడడంతో మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆడిట్‌కు అడ్డుపడుతున్న అక్రమాల కట్టడి..

మహిళా మార్ట్ కోసం ఖర్చు చేసిన సుమారు రూ.36 లక్షల నిధులపై ఇప్పటివరకు సరైన ఆడిట్ జరగలేదు. ఈ అక్రమాలకు ఈ ఇద్దరు బాధ్యులేనని మహిళా సంఘాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. "రూ.18 లక్షల ఖర్చు జరిగింది కానీ ఒక్క బిల్లు కూడా చూపించడం లేదు" అని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆడిట్‌పై ప్రశ్నిస్తే, "మీకు తెలియాల్సిన అవసరం లేదు" అని సమాధానం చెప్పడం అధికారుల అహంకారానికి, అక్రమాలకు నిదర్శనమని వారు మండిపడుతున్నారు.

బాధితులకు న్యాయం చేయాలి..

ఈ వ్యవహారం పూర్తిగా అధికార దుర్వినియోగానికి, ప్రజాధనాన్ని అపహరించడానికి నిదర్శనమని మహిళా సంఘాలు పేర్కొంటున్నాయి. మోసపోయిన బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని, నిధుల మళ్లింపుపై నిష్పక్షపాత విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళల కష్టార్జితాన్ని కాజేసిన ఈ అక్రమాలపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

నిష్పాక్షిక విచారణ జరగాలి

పదవి కలిగిన వారంతా సత్యమూర్తులే అనే గట్టి నమ్మకాన్ని తునాతునకలు చేసిన ఉదాహరణ ఇది. ప్రభుత్వం స్పందించకపోతే ముందు ముందు మరిన్ని దారుణాలు చూడాల్సిందే. జిల్లా కలెక్టర్ స్పందించి మహిళా మార్ట్‌లో జరిగిన కుంభకోణంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని సంఘ సభ్యులు బహిరంగంగా చెబుతున్నారు.

## 77 మంది ఆర్‌పీలకు రావలసిన డబ్బులను మింగేశారా?

సోషల్ ఎకనామిక్ సర్వే నిమిత్తంగా పనిచేసిన శ్రీకాకుళం పట్టణానికి చెందిన 77 మంది ఆర్‌పీలకు మొత్తం రూ.5 లక్షలు విడుదల కాగా, ఒక్కొక్కరికి కేవలం రూ.2,500 చొప్పున చెల్లించి, మిగిలిన రూ.3 లక్షలకు పైగా తన ఖాతాలో వేసుకున్నాడని, వెంకటరావుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీని గురించి ఎవరైనా ప్రశ్నిస్తే నిశ్శబ్దం తప్పదు.

## నాసిరకం సంచుల వ్యాపారం.. లక్షల రూపాయల మాయ

సుమారు 27 వేల మంది మహిళా సంఘాల గ్రూప్ సభ్యుల దగ్గర నుంచి రూ.350 చొప్పున వసూలు చేసిన వెంకటరావు, విలువ లేని నాసిరకం సంచులు సరఫరా చేశాడని మహిళా సభ్యుల ఆవేదన వ్యక్తమవుతోంది. అసలు వీటి విలువ రూ.120 కూడా కాకపోయినా, వేల ప్యాకెట్లను పంపిణీ చేసి దాదాపు రూ.60 లక్షలు మింగేశాడనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. "ఇప్పుడు అవి రెండు మూడు వారాల్లోనే చిరిగిపోతున్నాయి.. మా డబ్బుల్ని దోచేసాడు" అని బాధితులు వాపోతున్నారు.

## లెక్కల తారుమారు చేసే 'మహిళా మార్ట్ గ్యాంగ్'



వెంకటరావుకు అత్యంత నమ్మకస్తులుగా వ్యవహరిస్తున్న మహిళల పేర్లూ బయటపడ్డాయి. మహిళా మార్ట్‌లోని లెక్కలు బయటకు వెళ్లిపోకుండా తలుపులు మూసే బాధ్యతను అప్పగించినవారిగా శ్రీ సంపద టి.ఎల్.ఎఫ్ ఆర్‌పీలు అమ్మాజీ, లోకేశ్వరి పేర్లు వినిపిస్తున్నాయి. వీరే అన్ని లావాదేవీలలో మధ్యవర్తులుగా వ్యవహరించి లెక్కలు కలుపుతున్నారని సమాచారం. "వీరికి హస్తక్షేపం లేకుండా ఒక్క డబ్బు కూడా బయటకి వెళ్లదు" అంటున్నారు వర్గాలు.

## చెక్కు పవర్ ఉన్న వారు ఎందుకు మౌనం వహిస్తున్నారు?

మహిళా మార్ట్‌లో చెక్కులు జారీ చేసే అధికారంతో ఉన్న బలగ నాగలక్ష్మి (ప్రస్తుతం జిల్లా అధ్యక్షురాలు), కార్యదర్శి అమర, కోశాధికారి వెంకటలక్ష్మిలు ఇప్పటి వరకూ ఒక్క పదమూ మాట్లాడకపోవడంపై మహిళా సంఘాల్లో శంకలు చెలరేగాయి. "వీరి మౌనం వీరికి కూడా వాటాలున్నాయనే సంకేతమా?" అనే చర్చ జరుగుతోంది.

## 'అప్పటి వైసీపీ, ఇప్పటి టిడిపి ఏ ఎండకు ఆ గొడుగు!'

గత వైసీపీ హయాంలో మహిళా సంఘాల ఉపాధ్యక్షురాలిగా ఉన్న నాగలక్ష్మి.. ఇప్పుడూ అదే హవా కొనసాగిస్తుండటం వల్లే వెంకటరావు వంటి అధికారులు జవాబుదారితనాన్ని లెక్క చేయడం లేదని మహిళలు ధ్వజమెత్తుతున్నారు. "సంపద కోసం మహిళల నమ్మకాన్ని దగా చేసిన వాళ్లకి ఇప్పటికైనా బుద్ధి రావాలంటే.. అధికారుల జోక్యం తప్పదు" అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎండకు ఆ గొడుగు పట్టడం ఇదే అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

## మహిళా మార్ట్ కార్యాలయంలో గుబి గుబి..

'జాతీయ వార్త'లో ప్రచురితమైన మహిళా మార్ట్ పై అవినీతి కథనం ఆ శాఖ కార్యాలయంలో కలకలం రేపింది. ఒక్కసారిగా వార్త దెబ్బకు సిబ్బంది గుబిగుబిగా పాత రికార్డులన్నీ వెతకడం ప్రారంభించారు. అస్తవ్యస్తంగా ఫైళ్లలోకి దూకి, హడావుడిగా అనేక పత్రాలపై సంతకాలు పెట్టేశారు. ఇదంతా అనుమానాస్పదంగా కనిపించిన ఓ ప్రైవేట్ వ్యక్తి ఆ వీడియో తీయడానికి యత్నించగా, అక్కడున్న కొందరు సిబ్బంది అతడిపై దాడికి దిగినంత పని చేశారు. అతని సెల్‌ఫోన్ లాక్కొని, తీసిన వీడియోలు, ఫొటోలను డిలీట్ చేసినట్టు సమాచారం. నిజంగా ఏ పాపం చేయకపోతే ఇటువంటి ఉత్పాతం ఎందుకు? ఇది రికార్డు టాంపరింగ్‌కు మరో నిదర్శనమా అనే అనుమానాలు గుప్పుమంటున్నాయి.

**మరిన్ని వివరాలతో రేపటి సంచికలో మరింత లోతుగా విశ్లేషణ చేద్దాం. మరిన్ని ఆధారాలతో, బాధితుల వాంగ్మూలాలతో త్వరలో మరో ఆసక్తికర కథనంతో మీ ముందుకు వస్తాం.**



# విద్యార్థినుల ధర్నా

* గురువుల మధ్య ఆధిపత్యంపోరు * పట్టులోగాం ఆశ్రమంలో గందరగోళం

**మందస, ఆగస్టు 5(వార్త):** మందస మండలంలోని పట్టులోగాం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ చదువుతున్న పాఠశాల ఎదుటే విద్యార్థినులు మంగళ వారం ధర్నాకు దిగారు. ఈ పాఠశాలలో 3 నుంచి 10 వతరగతి వరకు సుమారు 120 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. కొంతమంది విద్యార్థినుల తల్లిదండ్రులు అందజేసిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాలలో పలువురు ఉపాధ్యాయినులు సబ్జెక్టు పరంగా సందేహాలు అడుగుతుంటే నివృత్తి చేయకుండా దుర్భాషలాడుతూ ఇష్టం వచ్చినట్లు దూషిస్తున్నారని ఇటీవల విద్యార్థుల తల్లిదండ్రులు ఐటిడిఏ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే సమస్య పరిష్కారం కాకపోవడంతో మంగళవారం పట్టులోగాం పాఠశాల గేటు వద్ద విద్యార్థినులు నిరసన కార్యక్రమం చేపట్టారు. హిందీ టీచర్ డి.గీత, తెలుగు టీచర్ సిహెచ్ పద్మావతి, సోషల్ టీచర్ టీ తేజేశ్వరిలు మాకు వద్దంటూ నినాదాలు చేశారు. దీంతో పాఠశాలలో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో బయటకు విషయం పొక్కింది. అయితే పాఠశాలలో గత కొన్ని రోజులుగా ఉపాధ్యాయినుల మధ్య గ్రూపుల గోల, ఆధిపత్య పోరు చోటు చేసుకోవడమే ప్రధాన కారణంగా పలువురు భావిస్తున్నారు. తరచూ రభస చోటు చేసుకుంటూ ఉండడంతో ఆ కోపాన్ని విద్యార్థులపై చూపిస్తున్నారనే ఆరోపణ వెల్లువెత్తుతుంది. ఉన్నతాధికారులు తక్షణమే పట్టులోగాం ఆశ్రమ పాఠశాల సమస్యను పరిష్కరించి విద్యార్థినులకు సక్రమంగా బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై మందస ఏటీడబ్ల్యూఓ మల్లిఖార్జున రావు వద్ద ప్రస్తావించగా సమస్యను ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. ఆశ్రమపాఠశాలలో సమావేశం నిర్వహించి సమస్యను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమగ్ర రిపోర్టును తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

# తీరంలో విషాదం

* భావనపాడు బీచ్‌లో స్నానానికి దిగిన స్నేహితులు
* అలలకు ముగ్గురు యువకులు గల్లంతు





**సంతబొమ్మాళి, ఆగస్టు5 (వార్త):** భావనపాడు సముద్ర తీరంలో ముగ్గురు పాలిటెక్నికల్ యువకులు సముద్ర స్థానానికి వచ్చి గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే వజ్రపుకొత్తూరు మండలం మడివానిపేటకు చెందిన దున్న దుర్యోధన(18), పూడి జగన్నాధపురం చెందిన తిమ్మల జస్వంత్(18), పలాస మండలం టెక్కలిపట్నంకు చెందిన రాయల రాజేష్ (18) విజయనగరం బాలాజీ పాలిటెక్నికల్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. వారం రోజుల క్రితం వారు తమ స్వగ్రామాలకు వచ్చారు. అందరూ ఒకే కాలేజీలో క్లాస్మెట్లు కావడంతో మంగళవారం భావనపాడు బీచ్‌కు వచ్చి సముద్రంలో స్నానాలకు దిగారు. వాళ్లు స్నానం చేసిన కొద్దిసేపట్లో సముద్రపు పోటు ఎక్కువ కావడంతో కెరటాలకు విద్యార్థులు కొట్టుకుపోయారు. నౌపడ ఎస్సై నారాయణరావు మెరైన్ పోలీసులు, మత్స్యకారుల సహా యంతో రాత్రంతా గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలను చేపట్టారు. తహసీల్దార్ హేమసుందర్ రావు సంఘటన స్థలానికి చేరుకొని వారి కుటుంబీకులు, మత్స్యకారుల నుంచి వివరాలను సేకరించారు. చేతికి అంది వచ్చిన కుమారులు చనిపోవడంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.



## శ్రీముఖలింగంలో రైతులకు ఎరువుల కొరత



**జలుమూరు, ఆగస్టు 5(వార్త):** శ్రీముఖలింగంలో 25 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం ఉన్నప్పటికీ పని వేళల్లో తాళాలు వేసి ఉండడం, సిబ్బంది పని చేయకపోవడం సకాలంలో రైతులు ఎరువులు అందకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని యునైటెడ్ నేషన్స్ ఎగైనెస్ట్ కరప్షన్ నేషనల్ అంబాసిడర్ నాయుడు గారి రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చుట్టుపక్కల 10 గ్రామాలకు ప్రధాన కేంద్రమైన శ్రీముఖలింగం వదిలి వ్యవ సాయ శాఖ అధికారులు రైతులకు ఆరు కిలోమీటర్ దూరంలో ఉన్న మర్రివలస కేంద్రానికి పనులు మానుకుని వెళ్ళమనడం ఎంతవరకు సమంజసమని, ఎక్కడ రైతు భరోసా కేంద్రం – ఉందో అక్కడే ఎరువులు అందివ్వాలని, తక్షణమే వ్యవసాయ శాఖ జెడి ఈ ఎరువుల కొరత సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

# స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి






**కొత్తూరు, ఆగస్టు 5 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కొత్తూరు మండల విద్యుత్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ, "ఎన్నికలకు ముందు 'స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండి' అంటూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పిలుపిచ్చిన విషయం తెలిసిందే. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడమంటే ప్రజలను మోసం చేసినట్టే" అని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజలపై దోపిడీ పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, "టైం ఆఫ్ ది డే" విధానంలో పగలు ఒక రేటు, రాత్రి మరొక రేటు, సాయంత్రం 6 నుండి 10 గంటల వరకూ ఇంకో ప్రత్యేక రేటు విధించడం వల్ల ప్రజలకు తీవ్ర భారం పడుతోందన్నారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన తెలుగుదేశం కూటమి మాట తప్పిందని విమర్శించారు. కేరళ, బెంగాల్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తున్నాయని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు దశలవారీగా ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్లు అమర్చాలని ఆదేశాలు జారీ చేయడం అన్యాయం అన్నారు. ఇది కేవలం మీటర్ మార్పే కాదు, విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే కుట్ర అని ఆరోపించారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ద్వారా సెల్ ఫోన్ తరహాలో ముందుగా డబ్బు చెల్లించాల్సి రావడంతో, కనీసం రూ.500 బ్యాలెన్స్ లేకపోతే కరెంటు నిలిపివేయబడే పరిస్థితి ఉందన్నారు. ఇలా కొనసాగితే పేద ప్రజల జీవితాలు చీకట్లో మిగలే ప్రమాదముందని హెచ్చరించారు. ఇటీవల ప్రజలకు తెలియకుండా 93 నెలల వాయిదాల రూపంలో కరెంటు బిల్లుతో పాటు స్మార్ట్ మీటర్ ధర వసూలు చేయడం కూడా అన్యాయమని అన్నారు. ప్రజలంతా ఐక్యంగా స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించేందుకు సమ్మిళిత పోరాటాలకు సిద్ధం కావాలని సిర్ల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, సీఐటీయూ నాయకులు పనస రమేష్, ప్రజాసంఘాల నాయకులు జయరాజు, రమేష్, చిన్నమ్మి, రము, కుమారి, పోలయ్య, రాములు, తెల్లన్న తదితరులు పాల్గొన్నారు.

**నరసన్నపేట:** ప్రజలపైన ఎటువంటి భారాలు వేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల పైన ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నరసన్నపేట తహసిల్దార్ ఆఫీస్ ఎదుట వారు ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెకి ఒప్పందాన్ని రద్దు చేయమని డిమాండ్ చేసిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మారిపోయిందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను మోసగించవద్దన్నారు. తక్షణమే ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను రద్దుచేసి, కరెంట్ చార్జీలు తగ్గించాలని.. లేని యెడల పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అరవింద్ నాయకులు మధుసూదనరావు, భాస్కరరావు, కర్ణవీరుడు, లవుడు, విజయ్, చిన్నబాబు, కుమార్, వాసు, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

**పలాస, ఆగస్టు 5 (వార్త):** బడా పారిశ్రామిక వేత్త ఆదాని ఆదేశాలను కూటమి ప్రభుత్వ నాయకులు అమలు చేస్తున్నారని, ప్రజల పైన ఎటువంటి భారాలు వేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల పైన ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపి, స్మార్ట్ మీటర్లను అంటకడుతున్నారని, వాటిని రద్దు చేయాలని సిపిఐ నాయకులు చాపర సుందర్ లాల్, సిపిఎం నాయకులు గణపతి, సిపిఐ ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు డిమాండ్ చేశారు. మంగళవారం పలాస విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం లో డబుల్ ఇంజన్ సర్కార్ కరెంట్ చార్జీల భారాన్ని తొలగించాలని, స్మార్ట్ మీటర్లు పేరుతో సాగుతున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. అదానీతో కేంద్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దుచేసి ముఖ్యమంత్రి పారదర్శకత నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో తెప్పల అజయ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సిహెచ్ రవి, తెప్పల రాజు, కెలింగమూర్తి, గేదెల నీలకంఠం, జుత్తు వీరాస్వామి పాల్గొన్నారు.





## గిరిజన గ్రామాల్లో బీజేపీ ప్రచార రథం

**కొత్తూరు, ఆగస్టు 5 (వార్త):** ఇరపాడుగూడ పంచాయతీలో బీజేపీ మండల అధ్యక్షుడు బురడా భాస్కరరావు నేతృత్వంలో మంగళవారం బీజేపీ ప్రచార రథం నిర్వహించారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల సుపరిపాలనను తెలియజేసే కరపత్రాలను గడప గడపకి అందజేశారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాపలా దమయంతి, పూర్వ జిల్లా కార్యదర్శి వలురౌతు ప్రసాద్, పూర్వ మండల అధ్యక్షులు నంసింహులు, తోయక ఆనంద్, పొద్దిని నారాయణరావు, భాస్కరరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల సేవలు అభినందనీయం



**జి.సిగడాం, ఆగస్టు 5(వార్త):** మెట్టవలస గ్రామ సచివాలయ ఉద్యోగులు గొబ్బూరు పంచాయతీలో నిర్వర్తించిన సేవలు అభినందనీయమని గ్రామ సర్పంచ్ కామోజుల అరుద్ర, మహాదాస్యం చిన్నారావు ఎంపీటీసీ బెవర లక్ష్మీ ప్రశంసించారు. బదిలీపై వెళ్లిన ఆ ఉద్యోగులకు స్థానిక గ్రామ సచివాలయంలో మంగళవారం సన్మాన సభ నిర్వహించారు. వీరికి దుశ్శాలువాలు కప్పి, పూలమాలలతో ఘన సత్కారం చేశారు. గ్రామ ప్రజాప్రతినిదులు సీతారాం, జగన్నాధరావు తమకు బాగా సహకారాన్ని అందించారని, ఇప్పుడు బదిలీపై వెళ్లడం బాధాకరంగా ఉందని ఉద్యోగులు తెలిపారు. కార్యక్రమంలో బెవర బాలకృష్ణ, పైల వాసు, పంచాయతీ కార్యదర్శులు బొంతు వెంకటరమణ, రౌతు చైతన్యకుమారి పాల్గొన్నారు.

## బదిలీ ఉపాధ్యాయునికి సన్మానం



**మందస, ఆగస్టు 5(వార్త):** మందస మండలంలోని సొండిపూడి జడ్పీహెచ్ పాంశాలలో సుదీర్ఘకాలం గణిత ఉపాధ్యాయునిగా పనిచేసిన సంక నారాయణరావుకు ఘన సన్మానం జరిగింది. ఇటీవల బదిలీలలో బుసాపద్ర ఎంపీయుపీ స్కూల్‌కు బదిలీ అయిన సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుందరసాల్మన్, సిబ్బంది మాట్లాడుతూ ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో చైర్పర్సన్ మాకమ్మ తలగాన మహేష్, చింతాడ లక్ష్మీనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టీచర్లను పాఠాలు చెప్పనివ్వండి

**ఎల్ఎన్ పేట, ఆగస్టు 5 (వార్త):** సంస్కరణల పేరిట పాఠశాల విద్యాశాఖలో వస్తున్న మార్పులన్నీ ఉపాధ్యాయుల బోధనా సమయాన్ని హరించేవిగానే ఉన్నాయి తప్ప విద్యార్థుల బోధన అభ్యసనను, విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేవిగా లేవని ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ ప్రభుత్వాన్ని విమర్శించారు. లక్ష్మీనర్సుపేట రోటరీ నగర్ పాఠశాలలో ఎస్‌టియు మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ పాల్గొని మాట్లాడారు. ఏడుగురు పిల్లలు ఉన్న తల్లులు ఖాతాల్లో కూడా తొంబై ఒక్క వేయి రూపాయలు జమ చేశామని చెబుతున్న ముఖ్యమంత్రొ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు కూడా తల్లికి వందనం డబ్బులు వేస్తూ పిల్లల్ని ప్రభుత్వం పాఠశాలలో చేర్చమని ఎలా చెబుతున్నారని ఇలాగేనా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడం అని ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తిరోగమన విధానాలను మానుకోకపోతే రానున్న రోజుల్లో ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ, మండల కార్యవర్గ సభ్యులు చింతాడ సూర్యారావు, పేడాడ ప్రభాకర్ రావు, ఎ.వెంకట్, పి.శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## శిరీషను అగౌరవిస్తే తీవ్ర పరిణామాలు



**మందస, ఆగస్టు 5(వార్త):** హరిపురంలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అధ్యక్షతన టీడీపీ నాయకులు మంగళవారం విలేఖరులతో మాట్లాడారు. మాజీ మంత్రి అప్పలరాజు.. శాసనసభ్యురాలు గౌతు శిరీష నీచమైన రాజకీయాలు చేస్తున్నారని వ్యాఖ్యానించడం అర్ధరహితమన్నారు. ఐదేళ్లుగా మాజీమంత్రి అప్పలరాజు మహిళా నాయకురాలు అని కూడా చూడకుండా గౌతు శిరీషపై సోషల్ మీడియాలో, అనేక సందర్భాల్లో మీరు మాట్లాడింది కూడా ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ఇప్పటికీ కూడా ఒక మహిళా శాసన సభ్యురాలు అని కూడా చూడకుండా అగౌరవంగా మాట్లాడడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇకపై ఇటువంటి పరిణామాలు జరిగితే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పలాసను నేనే అభివృద్ధి చేశానని మాజీ మంత్రి అప్పలరాజు గొప్పలు చెప్పుకోవడాన్ని ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని, ఈ ప్రాంతంలో కిడ్నీ ఆసుపత్రికి 2018లోనే అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శంకుస్థాపన చేయడాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. భావనపాడు పోర్ట్, రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, మందస డబల్ రోడ్డు.. గత తెలుగుదేశం పార్టీ హయాంలోనే శంకుస్థాపన చేసినవే.. పూర్తి చేయగలిగారన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, సాలిన మాధవరావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, ముడుముంచి నవీన్ కుమార్, బమ్మిడి కర్రయ్య, డొంకురు తిరుపతిరావు, రాజాన మహేష్, ముంజటి చంద్రశేఖర్, సిర్ల కృష్ణారావు, కోణారి తులసిరావు, ఔగాన ఈశ్వరరావు, బుసకల మురళి, బదకల వెంకట్రావు, మిష్క మోహన్, కొర్నాన నాగేశ్వరరావు, మురళి, దేబాసిస్ పండా, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శిరీషపై వైసీపీ నేతల ఫిర్యాదు



**మందస, ఆగస్టు 5(వార్త):** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై ఎమ్మెల్యే గౌతు శిరీష అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇవి శృతిమించిడంతో ఆమెపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మందస పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పారు. అదేవిధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను బాస్టర్డ్స్ అని సంబోధించడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరిపై ఇక మీదట ఎటువంటి అనుచిత వ్యాఖ్యలు చేసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల నుండి అంతే గట్టిగా సమాధానం ఉంటుందని హెచ్చరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టే దోరణిలో ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రెస్ మీట్లు ఉన్నాయని ఆరోపించారు. అక్రమ కేసులకు, అరెస్ట్ లకు భయపడేది లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం డొల్లతనం తేలిపోయిందని, ప్రజలు విశ్వసించకపోవడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని, మరలా వచ్చేది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. భవిష్యత్తులో వడ్డీతో సహా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దానయ్య, దుంపల వెంకటరావు, పులారి పితాంబరం, దున్న హరికృష్ణ, బత్తిన వెంకట్, గొరకల కేశవరావు, గిన్ని తిరుపతి రెడ్డి, కిషోర్, సిందిరి జగన్, కంచిబెహర, బృందావన్, రాము, జగదీష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బదిలీ లెక్చరర్‌కి సన్మానం



**ఇచ్ఛాపురం, ఆగస్టు 5(వార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న కామర్స్ లెక్చరర్ నాగేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల బారువాకి బదిలీ అయ్యారు. కళాశాల తరపున ఆయనకు మంగళవారం సన్మానం చేశారు. కళాశాలకు ఆయన చేసిన సేవలు, శత శాతం విద్యార్థుల ఉత్తీర్ణత సాధించడానికి చేసిన కృషిని అందరు మెచ్చుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు దుర్యోధన, శివకుమార్, సీతమ్మ, సంతోషకుమార్ త్రిపాఠీ, మోహనరావు, ఈశ్వరరావు, రాధ, వరప్రసాద్, బృందా వనం, దేవరాజు, లోకేష్ పాల్గొన్నారు.



## 90 లీటర్ల సారా స్వాధీనం

**-ఇద్దరి అరెస్టు, స్కూటీ స్వాధీనం**

**మందస, ఆగస్టు 5(వార్త):** ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మురలీధర్ ఆధ్వర్యంలో సోంపేట ఎక్సైజ్ సీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ కొండలోగాం సమీపాన 90 లీటర్ల సారాను స్వాధీనపరచుకొని, ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకున్నారు. వీరిని కొండలోగాం గ్రామానికి చెందిన సవర నందరావు, సవర కుర్మయ్యగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి, స్కూటీని సీజ్ చేశామని, సోం పేట మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా రిమాండ్ విధించారన్నారు. దాడుల్లో సీఐలు శ్రీనివాస్, జీవీ రమణ, ఎస్ఐ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

## నారీశక్తిపై అవగాహన



**ఇచ్ఛాపురం, ఆగస్టు 5(వార్త):** నారీ శక్తి పై ఆంధ్రా ఒడిశా సరిహద్దు జరడా జంక్షన్ సమీపంలో మహిళలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మహిళా రక్షణ, బాల్య వివాహాలు,గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి వివరించారు. 112 , 1098, 1930 టోల్ ఫ్రీ నెంబర్లపై రూరల్ ఎస్ఐ ఈ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు డొంకూరు విద్యార్థులు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 5(వార్త):** డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. వీరికి మంగళవారం ప్రధానోపాధ్యాయులు జి.హేమకుమారి ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. 9 నుంచి 11 వరకు బాపట్ల జిల్లా చీరాలలో విఆర్ఎస్ కాలేజీ గ్రౌండ్ వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో బి.భరత్‌చంద్ర (అండర్ 16/షాట్ పుట్) పి.హారిక (అండర్ 16/ గర్ల్స్) హైజంప్, బి. గణేష్ (హై జంప్ అండర్ 16 బాయ్స్) ఎస్.మాధవి(అండర్ 16/గర్ల్స్, పెంటతలోన్), ఎస్.రాంచరణ్ అండర్ (16/బాయ్స్, పెంటతలోన్) పాల్గొననున్నాను. ఈ విద్యార్థులను ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్, విద్యా కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

## మనమిత్ర సేవపై అవగాహన

**ఇచ్ఛాపురం, ఆగస్టు 5(వార్త):** లాలాపేట సచివాలయం పరిధిలోని చిన్నదేవర వీధి వద్ద మనమిత్ర వాట్సాప్ సేవ పై ప్రజలకు అవగాహన కల్పించారు. మన మిత్ర ద్వారా నేరుగా ప్రభుత్వ సేవలను పొందవచ్చని 16వ వార్డు ఇంచార్జ్ న్యాయ వాది నాగరాజు పాత్రో తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏడాదిగా సుపరిపాలన అందిస్తుందని, సూపర్‌సిక్స్ హామీలను వరుసగా అమలు చేస్తుందని, ప్రతి పేదవారికి అర్హతల మేరకు సంక్షేమ పథకాలు అందించేలా నిరంతరం ప్రభుత్వ యంత్రాంగాన్ని కూటమి నాయకులు పని చేయిస్తున్నారన్నారు. వార్డు సచివాలయ విద్యా కార్యదర్శి విల్సన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 17వ వార్డు ఇన్చార్జి జన్నెల సంతోష్, 33వ బూత్ కన్వీనర్ రవికుమార్ గౌడో, దిలీప్ కుమార్ సాహు, సచివాలయ సిబ్బంది ఏమినిటీస్ సెక్రటరీ కప్ప జయలక్ష్మి, ఆరోగ్య కార్యదర్శి ఎస్.ధనలక్ష్మి, వుమెన్ ప్రొటెక్షన్ ఏ.కేదారేశ్వరి, వార్డ్ రెవెన్యూ కార్యదర్శి కె.అప్పలరాముడు తదితరులు పాల్గొన్నారు. 7, 8 వార్డుల పరిధిలో జరిగిన కార్యక్రమంలో రంగాల శ్రీనివాస్ రెడ్డి, ఉనా సంతోష్, కాయ శ్రీనివాస్, కనక రత్నం, సుజిత్‌కుమార్, తులసమ్మ పాల్గొన్నారు.



# అగమ్యగోచరంగా రైతుల భవిష్యత్



**మందస, ఆగస్టు 5(వార్త):** వర్షాల్లేక రైతుల పరిస్థితి ఆగమ్య గోచారంగా తయారయ్యిందని వంశధార సాగునీరు సాధన కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మందస మండలంలోని హరిపురంలో గల మార్పు గ్రంథాలయములో అధ్యక్షుడు మార్పు మన్మధరావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశంలో మన్మధరావు మాట్లాడుతూ వరి విత్తనాలు వేసి ఇప్పటికే 40 రోజులయ్యిందని, వ భావ పరిస్థితులు కారణంగా వరి నాట్లు వేయలేని పరిస్థితి నెలకొని ఉన్నదని అన్నారు. వర్షాలు లేక జలాశయాల్లో నీరు అడుగంటి ఉన్నదని ఇలాంటి పరిస్థితి ప్రతీ ఏటా సంభవిస్తున్నదని, అయినా రైతులలో చలనము రాకపోతే రైతాంగ భవిష్యత్ అగమ్య గోచరమవుతుందన్నారు. భవిష్యత్ కార్యక్రమాలకు కార్యాచరణపై ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు, నల్ల హడ్డి మాట్లాడుతూ వంశధార జలసాధనకు రైతులంతా పార్టీలకు అతీతముగా కలిసి రావాలని కోరారు. ప్రభుత్వాలు పునరాలోచన చేసి త్వరితగతిన వంశధార సాగునీరు అందించే వరకు అలుపెరుగని పోరాటం చేయాలని కొర్ల హేమారావుచౌదరి కోరారు. సోంపేట మండలం సునాముది ఆయకట్టు ఛానల్ కు చివర రైతులమైన మేము ప్రతి ఏడాది నష్టపోవాలసి వస్తుందని, ప్రభుత్వాలు మారినా రైతన్న మీద ఎందుకు ఇంత నిర్లక్ష్యమని వెదుళ్ళ మాధవరావు అన్నారు. రాజు తలుచుకుంటే కొరడా దెబ్బలు కొదవ అన్నట్టు పాలకలు తలుచుకుంటే వంశధార ఛానల్ ఇచ్ఛాపురం వరకు పొడిగించడం ఎంత పని అని వాయలపల్లి మాధవరావు అన్నారు. గతం మాదిరిగా ఇప్పుడు అలాంటి చిత్ర వర్షాలు లేవు కనుక మాకు జక్కర్లు లేక ప్రతి ఏడాది మెరక భూములు పీకలు, పొట్టతో ఎండిపోవడం జరుగుతుందని మజ్జి బాబురావు అన్నారు. అంతా కలిసి సాధించుకోవాలని, గంగాధరరావు, ప్రజల్లో వంశధార సాధన కమిటీ చేస్తున్న కార్యక్రమం బాగుందని, అది తొందరగా జరగాలని దుంపల వైకుంఠరావు అన్నారు. మందస ప్రాంతం రాజకీయ కౌగిలిలో నలిగిపోతుందని ఈ నిర్లక్ష్యాన్ని విడాలని అంపోలు త్రినాధరావు అన్నారు. ప్రధాన ఎజెండా వంశధార సాగునీరు కోసం కమిటీ జరుగుతున్న కృషికి ప్రజలలో మంచి స్పందన ఉందని మామిడి కోదండరావు అన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు దశరధి, దేవాడ నారాయణరావు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అరాచక పాలన



**ఇచ్ఛాపురం, ఆగస్టు 5(వార్త):** ఈదుపురంలో వైస్సార్సీపీ తలపెట్టిన బాబూ స్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న వైస్సార్సీపీ రాష్ట్ర బీసీ విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రం లో ఆరాచక పాలన కొనసాగుతుందే తప్పితే ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలని ధ్యాసే లేదని 2024 2025 సంవత్సరానికి రెండు లక్షలకోట్లు అప్పులు చేసినా ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సుమారు 57 వేల కోట్లు రూపాయలు నిధులు కేటాయించపోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. అలాగే ప్రజల పై అప్పులుబారం మోపి వారి పై తెచ్చిన అప్పులు ఏమైయ్యాయని ఎవరు జేబులు నిపుతున్నారో ప్రజలే నిలదీయండని పిలుపునిచ్చారు .విద్యుత్ బిల్లు పెంచమని చెప్పి ఓట్లు అడిగి ఇప్పుడెందుకు పెంచారో ప్రజలకు తెలపాలని స్మార్ట్ మీటర్లు వ్యతిరేకుంచిన మీరే ఇప్పుడెందుకు ప్రజలు నెత్తిన పెడుతున్నారో చేప్పాలని, సంపద సృష్టిస్తామని చెప్పి లక్షలు కోట్లుఅప్పులు ఎందుకు చేస్తున్నారో ప్రజలకు తెలపండని అన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలైనా ఇంకా ఎందుకు 20వేలు రూపాయలు రైతులకుఎందుకు విడుదల చెయ్యలేదో చెప్పాలని జిల్లాకు ముప్పై శాతం ఎరువు మాత్రమే ఇస్తే మిగతా డెబై శాతం రైతులకు మోసం చేస్తున్నట్లు కాదా అని విమర్శించారు .ఈ కార్యక్రమం లో ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసి ఉప్పాడ నారాయణమ్మ, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు పాత్రిర్ల రాజశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానంద రెడ్డి, కారింగి మోహన్ రావు, సర్పంచ్ లు నీలాపు సారధి రెడ్డి దుక్క ధనలక్ష్మి కారింగి త్రినాధ్ రెడ్డి ఎంపీటీసీ ఆసి పురుషోత్తం రెడ్డి నీలాపు జగదీష్ రెడ్డి మరడ వలసయ్య రెడ్డి ఉపసర్పంచ్ మురా బెహరా అలఘరి నాగమణి బోనమాలి బెహరా రఘు బెహరా దువ్వు నీలయ్య ఆసి ఈశ్వర్ రావు పార్టీ అనుబంధం విభాగాల అధ్యక్షులు కార్యవర్గం సభ్యులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బదిలీ ఉపాధ్యాయుల జీతాలను విడుదల చేయాలి



**మందస, ఆగస్టు 5(వార్త):** ఇటీవల బదిలీలు పొంది, పాఠశాలలలో వివిధ కేటగిరీ పోస్టులలో చేరిన ఉపాధ్యాయుల పొజిషన్ ఐడిలు క్రియేట్ చేసి, జీతాలకై చర్యలు వేగవంతం చేయాలని ఏపీటీఎఫ్ మందస శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కిరణ్ కుమార్, కె.సుందరరావు కోరారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతంలోని నారాయణపురం, దున్నవూరు, గొల్లలపాలెం, సరియాపల్లి, సువర్ణపురం, బహడపల్లి, రట్టి, లింబుగాం, గంగువాడ, మఖరజోల, అల్లిమెరక తదితర పాఠశాలలను సందర్శిస్తూ సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఎరియర్ బిల్లులు, డీడీఓలు సబ్మిట్ చేసుకునే గడువును కూడా పెంచాలన్నారు. సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ ఉపాధ్యాయుల డీఏ, ఎరియర్స్ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బి.రామారావు, డి.రామారావు, బి.పురుషోత్తం, పి.తాతా రావు, కె.చిరంజీవి, డి.మన్మధరావు, బి.బైరాగి, బి.మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ కోసం గ్రీవెన్సులో నమోదు చేసుకోండి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 5(వార్త):** అన్న దాత సుఖీభవ అందని అర్హులైన రైతులు గ్రీవెన్సు లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ చెప్పారు. మంగళవారం ఈదుపురంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. గ్రీవెన్స్ మాడ్యూల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలనుకునే ప్రతి ఒక్క గ్రామ స్తుడు ముందుగా హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిగా చేయాలని,.అలాగే, 1బి పత్రంలో ఆధార్ నంబరు తప్పనిసరిగా నమోదు అయి ఉండాలని, ఈ రెండు అవసరాలను పూర్తి చేసిన తరువాత మాత్రమే రైతు సేవా కేంద్రం అధికారి లాగిన్ ద్వారా గ్రీవెన్స్ మాడ్యూల్‌కి యాక్సెస్ లభిస్తుందని అన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులను నమోదు చేసిన తరువాత, వాటి స్థితిని కూడా అదే లాగిన్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చు నని. సమస్య పరిష్కారం అయ్యే దశలన్నింటినీ ట్రాక్ చేయడానికి ఇది అనుకూలంగా ఉంటుందన్నారు. సంబంధిత శాఖలు వాటిని పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటాయి. ఇది గ్రామంలో పారదర్శకతను పెంపొందించి, ప్రభుత్వ పథకాల ఫలితాలు ప్రజలకు నేరుగా చేరేలా చేస్తుందని. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని, తమ సమస్యలను అధికారికంగా లాగిన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

## 53 కేజీల గంజాయి పట్టివేత



**శ్రీకాకుళం క్రైం/ఇచ్ఛాపురం/కాశీబుగ్గ, ఆగస్టు 5 (వార్త):** జిల్లాలో పెద్ద ఎత్తున గంజాయి తరలిస్తున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి 53 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా పోలీసు అధికారులు మంగళవారం వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం రాయగడ నుంచి పలాస రైల్వే స్టేషన్ మీదుగా తమిళనాడుకు తీసుకు వెళుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. రాయగడ నుంచి పిత్త వాసు అనే వ్యక్తి ద్వారా మణికంఠకు ఈ గంజాయిని అప్పజెప్పిన క్రమంలో వారిద్దరిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. అలాగే మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన మణికుమార్ నారాయణ భాయ్ పవార్ అనే వ్యక్తికి, ముంబాయి, దాధర్ ప్రాంతంలో పూలు వ్యాపారం చేయడానికి వెళ్లే సమ యంలో అతనికి మన్ ఖురేల్ ప్రాంతానికి చెందిన పూలు, గంజాయి వ్యాపారం చేసే ఆకాష్‌తో పరిచయం ఏర్పడింది. మణికుమార్ నారాయణ భాయ్ పవార్ డబ్బులు లేక పడుతున్న ఇబ్బందులు చెప్పగా, అంతట అకాష్, మణికుమార్, నారాయణ భాయ్ పవార్ తో కలిసి ఒడిశా రాష్ట్రం, మోహన ప్రాంతానికి చెందిన అశోక్ వద్దకు వెళ్లి గంజాయిని తీసుకువస్తే తెచ్చిన ప్రతీ సారి రూ.10వేలు ఇస్తానన‌డంతో మణికుమార్ నారాయణ భాయ్ పవార్ అంగీకరించాడు. ఇలా ఐదుమార్లు గంజాయిని తీసుకువెళ్లి ఆకాష్‌కి ఇచ్చాడు. ఇదేవిధంగా మంగళవారం వెళ్లి 12.650 కేజీల గంజాయిని తీసుకువస్తుండగా ఇచ్ఛాపురం టౌన్‌పోలీసులు అతడిని పట్టుకుని, ఆ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే శ్రీకాకుళం రూరల్ ఎస్సైకి వచ్చిన సమాచారం మేరకు కరజాడ ఇసుక ర్యాంపు మడపాం బ్రిడ్జి టౌన్ సమీపంలో ఆరుగురు వ్యక్తులు ఆటోలో అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకున్నారు. వారిని సోదా చేయగా 24 కేజీల డ్రై గంజాయి పట్టుబడింది. వారిపై కూడా శ్రీకాకుళం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జీవకోటికి మొక్కలే జీవనాధారం



**పలాస, ఆగస్టు 5(వార్త):** బెండి ప్రాథమికోన్నత పాఠశాల నందు బాదం, కదంబ, చెర్రీ జామ, వివిధ రకాల పండ్ల మొక్కలను గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో మంగళవారం నాటారు. ఈ సందర్భంగా జువాలజీ లెక్చరర్, గ్రీన్ ఆర్మీ ఉపాధ్యక్షులు రుంకు జనార్దనరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలకు పర్యావరణంపై అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో పలాస ఏపీఎన్జీవో అధ్యక్షులు బోనేల గోపాల్, ప్రధానోపాధ్యాయులు బి.బాబురావు, కామర్స్‌లెక్చరర్ జగదీష్, ఉపాధ్యాయులు తుంగానకేశవరావు కంచరాన పాపారావు, ఉప్పాడ లక్ష్మి, కే . శ్రీ కన్య, గ్రీన్ ఆర్మీ సభ్యులు లక్ష్మీనారాయణ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి





**మందస, ఆగస్టు 5(వార్త):** జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని మందస మండల జర్నలిస్టు సంఘ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు "ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్" పిలుపుమేరకు మందస రెవెన్యూ కార్యాలయంలో వర్కింగ్ జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసిల్దారు మిస్కా శ్రీకాంత్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడిటేషన్లు వెంటనే జారీ చేయాలన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్లు కమిటీలలో జర్నలిస్టుల యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులకు హెల్త్ స్కీం మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టులకు ప్రమాద బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. విశ్రాంత పాత్రికేయులకు పెన్షన్ పథకాన్ని ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో మందస మండల జర్నలిస్ట్ సంఘ ప్రతినిధులు వివి రమణమూర్తి, బి.సూర్యనారాయణ, ఎం.శ్రీను, కె.పూర్ణచందు, కె.ఆనంద్, ఎస్.ప్రకాష్, బి.ఎస్. కామేశ్వరరావు, ఎస్.గణపతి, ఎన్.రామకుమార్, పి.గణేష్ పాల్గొన్నారు.

**సరుబుజ్జిలి,:** రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర సమితి పిలుపు మేరకు సరుబుజ్జిలి మండలం అధ్యక్షులు కూటుకుప్పల తారకేశ్వరరావు ఆధ్వర్యంలో డిమాండ్స్ డేలో భాగంగా సరుబుజ్జిలి మండల ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట ధర్న నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో ఏఓ ప్రసాద్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే మండలం గౌరవాధ్యక్షులు బండి శ్యామలరావు, ఉపాధ్యక్షులు బాడాన మహేష్, కార్యదర్శులు సాకెటీ అసిరినాయుడు, అన్నం దొర్రై, బలగ సింహాచలం, పెద్దఎత్తున పాత్రికేయులు పాల్గొన్నారు.

**నరసన్నపేట:** రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని నరసన్నపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తోట చంద్రమోహన్‌దేవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసన్నపేట తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నర్సన్న పేట, జలుమూరు, పోలాకి, సారవకోట జర్నలిస్టులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం:** రాష్ట్రంలో 50 సంవత్సరాలు దాటిన జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ జర్నలిస్టులు తహశీల్దార్ వెంకటరావుకి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు లోకేష్, నాగరాజు పాత్రో, కృష్ణారావు పాత్రో, చిరంజీవి, రామారావు, వేణుగోపాల్, ధనంజయ, అప్పారావు, కేశవరావు, రమణ పాల్గొన్నారు.







## ఏపీజీఈఏ వినూత్న కార్యక్రమం

**కొత్తూరు, ఆగస్టు 5(వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్. సూర్యనారాయణ నేతృత్వంలో మంగళవారం ఉద్యోగుల కోసం ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వాన్ని ఒప్పించే నిమిత్తం "రండి - టీతాగుతూ మాట్లాడుకుందాం" అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కొత్తూరు తాలూకా యూనిట్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



**సరుబుజ్జిలి, ఆగస్టు 5(వార్త):** సరుబుజ్జిలి మండలం చిగురు వలస గ్రామంలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్‌ను టిడిపి నాయకులు బసవరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే మాతా శిశువుల సంరక్షణ



**పలాస, ఆగస్టు 5 (వార్త):** మాతా శిశువుల ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే పౌష్టికారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ పీవో కె.పార్వతి విజ్ఞప్తి చేశారు. శాసనంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయె మాట్లాడుతూ గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా తల్లి పాలు శిశువుకు దివ్య ఔషధంగా ఉపకరిస్తాయన్నారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఇస్తున్న పోషకాహారంతో పాటు ఏఎన్ఎంల ద్వారా సరఫరా చేస్తున్న ఐరన్, కాల్షియం మాత్రలు క్రమం తప్పకుండా వినియోగించాలని తల్లులకు సూచించారు. కార్యక్ర మంలో సూపర్వైజర్లు లతా, గంగమ్మ, అంగన్వాడి కార్యకర్తలు పద్మ, శ్రీలక్ష్మి, సంతోషిని తదితరులు పాల్గొన్నారు.

**భామిని, ఆగస్టు 5 (వార్త):** తల్లి తన బిడ్డకు ఇచ్చే పాలలో సంపూర్ణ పోషకాలు ఉంటాయని సీడీపీవో శాంతిభవాని అన్నారు. బాలేరు, బురుజోల, నులకజోడు అంగన్వాడీ కేంద్రాలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవం కార్యక్రమంలో మంగళవారం నిర్వహించారు. తల్లిపాలు విశిష్టత, బిడ్డ ఎదుగుదలకు, బిడ్డకు వ్యాధినిరోధక శక్తిని కల్పించడాన్ని వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జ్యోతిలక్ష్మి, సబిత పాల్గొన్నారు.



# ఘనంగా ఎల్‌ఎన్‌పేట పీఏసీఎస్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**ఎల్ఎన్ పేట, ఆగస్టు 5 (వార్త):** ఎల్ ఎన్ పేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం( పీఏసియస్) కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక ప్రైవేటు కళ్యాణమండపంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విచ్చేశారు. మండల పీఏసియస్ అధ్యక్షులుగా కాగాన మన్మధరావు, డైరక్టర్లు కొయ్యాన శ్రీనువాసరావు, యారబాటి రాంబాబులు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే గోవిందరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్షల మేరకు పనిచేసి ప్రభుత్వం అందిస్తున్న ఎరువులను రైతులకు సక్రమంగా అందజేయాలని సూచించారు. అలాగే ఈ ఖరీఫ్ సీజన్లో రైతులకు అవసరమైన పంట రుణాలను తక్కువ వడ్డీతో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హిరమండలం, ఎల్ఎన్ పేట మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# కురిగాంలో ఎరువుల పంపిణీలో అవకతవకలు

**కొత్తూరు, ఆగస్టు 5 (వార్త):** కొత్తూరు మండలంలోని కురిగాం పంచాయతీలో ఎరువుల పంపిణీలో అవకతవకలు చోటు చేసుకున్నాయని కురిగాం మరియు మహాదేవపురం గ్రామాల రైతులు ఆరోపించారు. ఈ విషయాన్ని వారు టీడీపీ యువ నాయకుడు శేపాన విక్రమ్ తెలియజేశారు.రైతుల ఫిర్యాదుపై తక్షణం స్పందించిన విక్రమ్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యను వివరిస్తూ చొరవ చూపారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లారు.ఎరువుల పంపిణీలో అవకతవకలకు కారణమైన అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.అలాగే, వెంటనే కొత్త వ్యవసాయ సహాయకునిని నియమించాలని, మామిడి గోవిందారావు విజ్ఞప్తి చేశారు. ఈ చర్యలతో రైతులు తమ సమస్యలపై స్పందించిన విక్రమ్ కు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా టీడీపీ తరఫున నిరంతరం కృషి చేస్తానని శేపాన విక్రమ్ తెలిపారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546